## కథ

# పేముబుట్ట

''గ్రాండ్ మదర్ సీరియస్..స్టార్ట్ ఇమీడియట్లీ!'' టెలిగ్రామ్‌ను అందుకున్న నాకు కాళ్లు చేతులు ఆడలేదు.

వేసవి సెలవులింక ఇచ్చేస్తారు. ఇంకో రెండు మూడు రోజుల్లో బామ్మని చూడ్డానికి మా పుట్టింటికి ప్రయాణమవుతున్న నాకు ఈ వార్త అశనిపాతంలా తోచింది.

కాళ్లు చేతులు ఆడలేదు. ఆఫీస్ నుండి శ్రీవారు రాగానే ఇద్దరం కలసి బయలుదేరాం.

ఆమధ్య ఇందిరొదిన కూతురి పెళ్లికి పిలుపు వస్తే కూడా, పిల్లల ఎగ్జామ్స్‌ని దృష్టిలో పెట్టుకొని నేను బయలుదేరలేదు. క్షమార్పణలతో ఇందిరొదినకి లెటర్ కూడా వ్రాశాను.

బామ్మని ఆ పెళ్లికి దగ్గరుండి తీసుకెళ్లిందట ఇందిరొదిన.

ఇందిరొదినంటే బామ్మ అక్కయ్యకి కూతురి కూతురు. అంటే నాకు మా పెద్దనాయనమ్మ మనుమరాలన్నమాట.

పెద్దనాయనమ్మ పోయాక మా రెండు కుటుంబాలకీ బామ్మ మాత్రమే పెద్దదిక్కు. చెట్టుకున్న పండుటాకులన్నీ నేలరాలిపోయాక..ఇంకా నేనెప్పుడు నేల రాల్తానోనన్నట్లుగా వంశవృక్షానికి మిగిలిన ఏకైక పండుటాకు బామ్మ.

కాని బామ్మ శరీరతత్వమే వేరు. ఎనభయ్యేళ్లు పైబడినా గుండ్రాయిలా దృఢంగా ఉండేది.

నున్నటి గుండు మీంచి సైను పంచె జారిపోతూంటే, సోడాబుడ్డి కళ్లద్దాలతో గమ్మత్తుగా ఉండేది బామ్మరూపం.

చిన్నప్పటి నుంచీ నాకు బామ్మ దగ్గర విపరీతమైన చేరిక. కనడం అంటే అమ్మ కన్నది కాని, నా పెంపకం, నా బాగోగులు అన్నీ..అన్నీ బామ్మే చూసుకునేది. ఆఖరికి నా పెళ్లి కూడా బామ్మ ఇష్టపడి, నిర్ణయించిన వరుడితోనే జరిగింది.

నేను బామ్మతో అంత చేరికగా ఉండటం అమ్మకెందుకో నచ్చేది కాదు.

''నీకస్తమానం ఆవిడతోనేంటే కబుర్లు..'' అంటూ గుడ్లురిమేది.

నేను మాత్రం అమ్మ అదిలింపులకి బెదిరేదాన్ని కాదు.

''జోరుగలాగు హైలెస్సా...!'' అంటూ ఏనుగునుబెట్టి ఎంతగా లాగించినా ఊడిరాని ఫెవికాల్ బంధంలా బామ్మని అతుక్కుపోయేదాన్ని మరింతగా.

బామ్మ దగ్గర విచిత్ర వస్తుసముదాయం కావలసినంత ఉండేది.

పాతకాలం నాటి కర్రదువ్వెన..నగిషీల వెండి భరిణె...తాతయ్య గుర్తుగా కర్రపాక్కోళ్లు..వెండి పొన్ను కర్ర..పుట్టింటి వారిచ్చిన సీమవెండిరేకు బొట్టు పెట్టె..ఇలా..చాలా..

అన్నింటినీ మించి ఓ పేముబుట్ట.

పేముతో దట్టంగా, నలుపలకలుగా అల్లిన బుట్ట...దానిమీద అలాంటిదే మూత! దానికి తాళం వేసుకుందికి వీలుగా చిన్న గొళ్లెం కూడా ఉంది.

అది ఇక్ష్వాకుల నాటిదేమోనని నా అభిప్రాయం.

దాన్నేమన్నా అంటే మాత్రం..బామ్మ ఒంటికాలిమీద లేచేది.

''అది, నా పుట్టింటి కానుకే! ఎప్పుడో యాత్రల కెళ్లినప్పుడు మా నాన్న నాకోటి, మా అక్కకోటీ కొనుక్కొచ్చారు...దాన్నేమన్నా అంటే మాత్రం నేనూరుకోను...!'' అని కోప్పడేది.

అంతేనా..అది బామ్మకి ఓ మేకప్ కిట్ లాంటిది..ఎక్కడికి ప్రయాణమయినా తన సామగ్రి అంతా అందులోనే సర్దుకొనేది.

మందులు..మడిబట్టలు..ఇంకా వగైరా వగైరా..

మేమందరం వెక్కిరించే వాళ్లం. ''దాన్ని పట్టుకెళ్ళకపోతే ఏ ఎయిర్ బ్యాగో తీసుకెళ్ళొచ్చు కదా..!'' అని.

కాని..మా ఎకసెక్కాలన్నింటినీ బామ్మ లెక్క చేసేది కాదు.

ముప్పై ఏళ్లక్రిందటి బుట్టయినా అదింకా క్రొత్తదానిలా మెరిసిపోయేది..బామ్మకి వస్తువు మీదుండే శ్రద్ధ అలాంటిది మరి..

నేవెళ్లినప్పుడలా బామ్మ అంటుండేది..''మా అక్క ఆ పేము బుట్టని తన గుర్తుగా పెద్దమనవరాలు ఇందిరకి ఇచ్చింది..నేనూ నీకే ఇస్తాను..ఎందుకంటే నువ్వు నా పెద్దమనవరాలివి కదా..!'' అని ఆ బోసినవ్వులో నా పట్ల వెలకట్టలేని అనురాగం అగుపించేది నాకు.

పెళ్లికి మావాళ్లిచ్చిన లెదర్ సూట్‌కేస్‌ని ఓల్డ్ ఫ్యాషనంటూ అటకెక్కించేసిన శ్రీవారు గుర్తొచ్చేవారు బామ్మ ఇలా అన్నప్పుడల్లా!

కాని..బామ్మని నొప్పించడం ఇష్టం లేక సరేననేదాన్ని.

''..ఇప్పుడిచ్చేయవే బామ్మా! పట్టుకుపోతానంటే'' తనుపోయాక దాన్ని తీసికెళ్లిపోమనేది-

ఆలోచనల్లో పడి బస్సెప్పుడాగిందో గమనించనే లేదు.

''లే భ్రమరా..మీ ఊరొచ్చింది...!'' శ్రీవారి పిలుపునకు ఉలిక్కిపడ్డాను. మేం ఇంటికి వెళ్లేసరికి ఇల్లంతా స్మశాన నిశ్శబ్దం తాండవిస్తోంది.

వెళ్తూనే ''అమ్మా! బామ్మేదీ..'' అడిగాను అనుమానంగా.

''ఇంకెక్కడి బామ్మే తల్లీ...'' అమ్మ బోరుమంది.

''అమ్మడూ...నాలుగు రోజులయి టెలిగ్రామ్ ఇస్తే ఇప్పుడా రావడం! నాన్నమ్మపోయి మూడ్రోజులయ్యింది..!'' విషాదంగా అన్నారు నాన్న.

'మూడ్రోజులయ్యిందా బామ్మపోయి!'...అవాక్కయ్యాను. ఇంత త్వరగా టెలిగ్రామ్‌ను నాకందించిన పోస్టల్ డిపార్ట్‌మెంట్ వారికి మనసులోనే ధన్యవాదాలర్పించాను.

మావారు పరామర్శించారు నాన్నగారిని..రాగానే వెంటనే అన్ని మర్యాదలూ ఘనంగా చేసే బామ్మలేకపోవడం ఆయనకీ తీరని లోటేమరి.

''అసలేం జరిగిందమ్మా!'' కంటినీరు తుడుచుకుంటూ అడిగాను నేను.

''ఈమధ్య వరకూ బాగానే ఉన్నారమ్మా..ఇందిరొదిన కూతురి పెళ్లికి కూడా వెళ్లొచ్చారు..ఇంకా నెల రోజులు అయినా కాలేదు. ఈ మాయదారి దగ్గు, ఆయాసం వచ్చిపడ్డాయి. పెద్ద వయసు కదా..మందులవీ వాడినా పని చేయలేదు..ఈ విధంగా జరిగిపోయింది'' అంది అమ్మ బాధగా.

ఆమె కళ్లల్లో కూడా అశృకణాలు ముత్యాల్లా మెరిశాయి.

అత్తాకోడళ్లు ఎంతగా పోట్లాడుకున్నా ఆ అనుబంధం అలాంటిది మరి.

ఆత్మీయుల మరణం కఠిన శిలలకైనా కంటనీరు తెప్పించక మానదు అనుకున్నాను.

బామ్మలేని ఆ ఇల్లు నిశ్చేతనగా..పాడుబడ్డ కొంపలా ఉంది.

బామ్మ కర్మకాండలన్నీ పూర్తయ్యేవరకు అక్కడే ఉన్నాం. అన్నీ శాస్త్రోక్తంగా పూర్తిచేశారు నాన్న.

తిరిగి ప్రయాణమవుతూంటే బామ్మ మాటలు జ్ఞాపకమొచ్చాయి.

''అమ్మడూ! నేపోయాక ఆ పేము బుట్ట నీతో తీసుకుపో..!'' బామ్మ అంటున్నట్లే అనిపించింది. శ్రీవారిని అడిగాను దాన్ని నాతో తీసుకొస్తానని. వారు సరేనన్నారు. ఆ పేము బుట్టని నాకియ్యమని, అమ్మని అడిగాను.

అమ్మ ఒక్కసారిగా తెల్లబోయింది. ఆ తరువాత మౌనంగా ఉండిపోయింది.

''ఏం జరిగిందమ్మా! పేము బుట్ట ఏదంటే మాట్లాడవేంటి! బామ్మ చివరికోరికగా దాన్ని నే తీసుకపోతాను..ఇలా ఇయ్యి..'' అన్నాన్నేను.

''అది..అది..లేదే!''

''లేదా! ఏమయ్యింది?'' ఈసారి ఆశ్చర్యపోవడం నావంతయింది.

''దాన్ని..దాన్ని మీ బామ్మ చితి మీదే వేసి కాల్చేయమని ఆవిడ ఆఖరి కోరిక..!'' అమ్మ మాటలకి తడుముకుంటున్నట్లుగా చెప్పింది.

నిర్ఘాంతపోయాను..ఏమిటీ విచిత్రమైన కోరిక..దాన్ని ఎప్పుడూ నాకిస్తానని అనే బామ్మ ఎందుకిలా చేసింది? ఏదో

అంతరార్థముంది.

కానీ..కాని..ఎంతగా ఆలోచించినా చిక్కుముడి వీడలేదు.

బామ్మ ఎందుకా విధంగా కోరిందన్న ప్రశ్నకి సమాధానం దొరకలేదు.

★★★

కాలపు ఒరవడిలో మరో రెండేళ్లు దొర్లిపోయాయి.

ఇందిరొదిన చిన్నకూతురి క్కూడా పెళ్లి నిశ్చయమయ్యిందని ఇన్విటేషన్ వచ్చింది.

పెద్దదాని పెళ్లికి వెళ్లలేదనే దానికి నామీద ఇంకా కోపం పోలేదు.

అందుకే పెళ్లికి తప్పక ఎటెండవ్వాలని నాల్రోజుల ముందుగానే బయలుదేరాను.

ఇందిరొదిన ఎంతగానో పొంగిపోయింది. మా ఊరు నుండి అమ్మ, నాన్న అన్నయ్య అందరూ వచ్చారు.

బామ్మని తలుచుకొని అందరం ఎంతగానో బాధ పడ్డాం.

ఇందిరొదిన అయితే మరీను..

''పెద్దదాని పెళ్లికి. చిన్నమ్మమ్మ ఎంతగానో సాయం చేసిందొదే..పిండివంటలన్నీ తనే దగ్గరుండి వండించింది..!'' ఇందిరొదిన మాట ల్తోగుండె బరువింకా ఎక్కువయ్యింది.



అయితే ఈ పెళ్లికి నేన్రావడం మూలాన బామ్మ చనిపోయే ముందు తీసుకున్న వింత నిర్ణయానికి మూలకారణం ఏంటో తెలుస్తుందని నేనసలు ఊహించలేదు.

ఆరోజు మగపెళ్లివారికి ఇవ్వవలసిన కాజాలు, సున్నుండలు, చక్కిలాలు చేయడానికి ఉపక్రమించాం.

చక్కిలాలకు పిండి దంపడానికి పూనుకొన్నాం...

''ఇందిరొదినా! పిండి దంపడానికి రోకలి ఎక్కడుంది? పనిమనిషి అడుగుతోంది!'' అడిగాను నేను.

''దానికెక్కడుందో తెలుసును. దాన్నే రమ్మనలేకపోయావా!''

''లేదొదినా! అది..ఆరిన బియ్యం బేసిన్లోకి తీస్తోంది..అందుకే నేనొచ్చాను..!'' అన్నాన్నేను.

''సరేలే..అదిగో! ఆ స్టోర్ రూమ్‌లో ఉంటుంది తీసుకెళ్లు..!'' ఇంకేదో పనిలో తలమునకలుగా ఉన్న ఇందిరొదిన హడావుడిగా చెప్పింది.

మేడమెట్ల దిగువగా ఉన్న స్టోర్‌రూమ్‌లోకి వెళ్లాను.

చీకటిగా ఉందా రూమ్. అదోరకం ముతక వాసన కొడుతోందాగదిలో..

మెల్లగా వెళ్లి కిటికీ తలుపులు తెరచాను.

విరిగిన కర్రసామాను..పాతబడిన, పనికిరాని వస్తువులు..చిరిగిపోయిన పరుపులు..బూజులు దులుపుకునే కర్ర..చెత్త చెదారం...అంతా గందరగోళంగా ఉంది.

ఓ మూలగా ఉన్న రోకలిని తీసుకుంటున్న నా దృష్టి, అప్రయత్నంగా ఓ వస్తువుమీద పడింది.

అది..అది..బామ్మదగ్గరుండేటువంటి పేము బుట్టలాంటిదే. ఇంకోటి. బహుశా పెద్ద నాయనమ్మదయ్యుండవచ్చు.

రంగు వెలసి..గొళ్లెం ఊడిపోయి..అసహ్యంగా..

ఆ పాతసామాన్లన్నింటిలో నుండి తొంగి చూస్తోందది..ఒక పనికిరాని జ్ఞాపకంలా..

ఇన్నాళ్ల నుండి నన్ను వేధిస్తున్న ఏకైకప్రశ్నకి జవాబు దొరికింది.

నేను కూడా..ఇలాగే..ఇందిరొదినలాగే తన పేము బుట్టను ఏ పాత సామాన్ల గదిలోకో విసిరేస్తానేమోనని బామ్మ ఆలోచించి ఉంటుంది.

అందుకే..అందుకే..బామ్మ తన గుర్తుగా నాకివ్వాలనుకున్న ఆ పేముబుట్టను.. ఆ జ్ఞాపకాన్ని తనతోపాటు చితి మీద కాల్చేసుకుంది.

నా కళ్ల చివరల నుండి రెండుకన్నీటి బొట్లు రాలిపడ్డాయి బాధగా.

☆

**కె. కె. భాగ్యశ్రీ**